

నల్లగొండ వీటీ కాలనీలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

## ఆడబిడ్డల పండుగపై కాంగ్రెస్‌కు అంత అక్కసా

- ప్రకృతి కరుణించినా ప్రభుత్వానికి కనికరం లేదు
- పదేండ్లుగా ఉత్సాహంగా బతుకమ్మ.. నేడు నిశ్శబ్దంగా
- ఆత్మలేని ప్రభుత్వంతో ప్రజలకు తప్పని అవస్థలు
- బతుకమ్మ వేడుకల్లో మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట, అక్టోబర్ 10(నమస్తేతెలంగాణ) : రాష్ట్రంలో బతుకమ్మ ఆడబిడ్డల పండుగని, అలాంటి పండుగపై కాంగ్రెస్ ప్రభుత్వానికి అంత అక్కసు ఎందుకని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ప్రశ్నించారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సద్దుల చెరువు మినీ ట్యాంక్‌బండ్ వద్ద బతుకమ్మ వేడుకల్లో గురువారం ఆయన తన కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులతో సరదగా ఫొటోలు, సెల్ఫీలు దిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సద్దుల చెరువు మినీ ట్యాంక్‌బండ్ వద్ద సుమారు 40వేల మంది మహిళలు బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారని, సరైన ఏర్పాట్లు లేకపోవడంతో ఇబ్బంది పడ్డారని అన్నారు. సద్దుల బతుకమ్మ రోజు ప్రకృతి కరుణించి వర్షం కురిపించి వాతావరణాన్ని చల్లబర్చిందని, ఇక రెండు మూడు గంటలైనా ఆడవచ్చనుకున్న మహిళలకు బతుకమ్మ పాట లేని నిశ్శబ్దం నిరాశను కల్గించిందని ఆవేదన వ్యక్తం చేశారు. పండుగ పూట రాజకీయాలు మాట్లాడొద్దనుకుంటే, బతుకమ్మ ఏర్పాట్లపై ఇంత నిర్లక్ష్యం చూస్తే ఊరుకోనివ్వడం లేదని తెలిపారు. పూలను పూజించే గొప్ప సంస్కృతి తెలంగాణదని, బతుకమ్మతో మన సంస్కృతి ఖండాంతరాలకు వ్యాపించిందని చెప్పారు. 60 ఏండ్ల అణిచివేతకు కొట్లాడి విముక్తి చేసుకున్నాక, ప్రతి పండుగను పదేండ్లు ప్రశాంతంగా జరుపుకున్నామని చెప్పారు. బతుకమ్మను కేసీఆర్ అధికారికంగా ప్రకటించి అంగరంగ వైభవంగా నిర్వహిస్తే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కుంటి సాకులతో పండుగ సంబురాలను చప్పగా చేసిందని విమర్శించారు. అధికార కాంగ్రెస్‌కు మన పండుగలన్నా, పాటలన్నా పట్టింపు లేదని, ముఖ్యంగా బతుకమ్మ పాట అంటే వాళ్లకు భయమైతుందని అన్నారు. అధికారికంగా నిర్వహించాల్సిన బతుకమ్మ పండుగకు నిధులు లేక పోవడంతోపాటు మైకులు కూడా మూగబోయే దుస్థితి ఏర్పడిందని తెలిపారు. ఎన్ని ఆటంకాలు సృష్టించినా, ఎవరు ఏమి మాట్లాడినా ఆనాడు సమైక్యాంధ్రులను ఎదిరించి నిలబెట్టుకున్న సాంస్కృతిక వారసత్వం మనదని, తప్పకుండా ఈనాటి పాలకులను కూడా ఎదిరించి ఈ వారసత్వాన్ని నిలబెట్టుకుందామని ప్రజలకు తెలిపారు. ఈ సందర్భంగా పట్టణవాసులకు జగదీశ్‌రెడ్డి దసరా శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, వైస్ చైర్మన్ పుట్ట కిశోర్, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

## పోలీస్ కస్టడీకి తాసీల్దార్ జయశ్రీ

హుజూర్‌నగర్, అక్టోబర్10 : ప్రభుత్వ భూములను అక్రమంగా ఇతరులకు బదిలీ చేయడంతోపాటు రైతు బంధు నిధులను స్వాహా చేశారనే ఆరోపణలపై బుధవారం హుజూర్‌నగర్ పోలీసులు ఆమెను అరెస్ట్ చేసి జూనియర్ సివిల్ కోర్టులో హాజరుపర్చిన విషయం తెలిసిందే. ఆమె నుంచి మరింత సమాచారాన్ని రాబట్టడం కోసం హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు గురువారం ఐదు రోజుల పోలీస్ కస్టడీకీ అనుమతించాలని కోరుతూ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. మరో పక్క జయశ్రీ తరఫున న్యాయవ్యాది ఆమెకు బెయిల్ మంజూరు చేయాలని పిటిషన్ దాఖలు చేశారు. ఇరు పక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి మారుతీప్రసాద్ తాసీల్దార్ జయశ్రీని శుక్రవారం ఉదయం 8:30 నుంచి సాయంత్రం 5గంటల వరకు విచారించేందుకు పోలీసులకు అనుమతిస్తూ ఆదేశాలు జారీ చేశారు. శుక్ర, శని, ఆది వారాలు న్యాయ స్థానాలకు సెలవు దినాలు కావడంతో ఆమె దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్‌ను న్యాయమూర్తి సోమవారానికి వాయిదా వేశారు.

## ఇంటిగ్రేటెడ్ గురుకులం మాకెందుకివ్వరు..?

### యాదాద్రి భువనగిరి జిల్లాకు సర్కారు మొండిచెయ్యి

- మంత్రులు ఉన్న చోటనే కొత్త గురుకులాలు
- సూర్యాపేట జిల్లాకు రెండు, నల్లగొండకు మూడు మంజూరు
- నేడు ప్రజాప్రతినిధులు చేతుల మీదుగా శంకుస్థాపన
- ఉమ్మడి నల్లగొండలోని ఏడు నియోజకవర్గాలపై చిన్నచూపు



యాదాద్రి భువనగిరి, అక్టోబర్ 10 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర ప్రభుత్వం యాదాద్రి భువనగిరి జిల్లాపై సవతి తల్లి ప్రేమ కనబరుస్తున్నది. జిల్లాల మధ్య వివక్ష చూపిస్తున్నది. ఒక్కో నియోజకవర్గాన్ని ఒక్కో విధంగా చూస్తున్నది. ఇందుకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ గురుకులాల మంజూరే నిదర్శనం. మంత్రులు ఉన్న చోట ఒకలా.. లేని చోట మరోలా కనిపెడుతున్నది. యాదాద్రి భువనగిరి జిల్లాకు ఇంటిగ్రేటెడ్ గురుకులం ఎందుకు ఇవ్వరని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

#### మంత్రులు ఉన్న జిల్లాలకే..

రాష్ట్ర ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను నియోజకవర్గానికి ఒకటి చొప్పున మంజూరు చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా పైలెట్ ప్రాజెక్ట్ కింద గురుకులాలను ప్రకటించింది. అయితే మంత్రులు ఉన్న నియోజకవర్గానికి మాత్రమే గురుకులాలను ప్రకటించారు. యాదాద్రి భువనగిరి జిల్లాకు ఒక్కటీ మంజూరు చేయలేదు. ఉత్తమ్ కుమార్ రెడ్డి మంత్రి ఉన్న సూర్యాపేట జిల్లాకు మాత్రం రెండు గురుకులాలు శాంక్షన్ చేశారు. మంత్రి సొంత నియోజకవర్గమైన హుజూర్‌నగర్ పరిధిలో 20 ఎకరాల స్థలాన్ని గుర్తించారు. ఇదే జిల్లాకు చెందిన తుంగతుర్తి నియోజకవర్గంలోని తిరుమలగిరి మండలంలో ఏర్పాటు కోసం 24 ఎకరాల స్థలాలను పరిశీలించారు. నల్లగొండకు చెందిన మరో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కూడా తన నియోజకవర్గానికి, దేవరకొండ, మునుగోడు నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ గురుకులాన్ని మంజూరు చేయించుకున్నారు. నల్లగొండ నియోజకవర్గంలో 20 ఎకరాలను గుర్తించి ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదనలు కూడా పంపించారు. కానీ యాదాద్రి భువనగిరికి మాత్రం మొండిచెయ్యి చూపించారు. ఈ జిల్లాను పట్టించుకోకుండా వివక్షను ప్రదర్శిస్తున్నారు.

#### మిగతా 7 నియోజకవర్గాలపై చిన్నచూపే..

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మొత్తం 12నియోజకవర్గాలు ఉన్నాయి. ఇందులో తుంగతుర్తి, హుజూర్‌నగర్, నల్లగొండ, మునుగోడు, దేవరకొండ మినహా మిగతా 7 నియోజకవర్గాలపై చిన్నచూపే చూపించారు. అన్ని అసెంబ్లీ పరిధుల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేయాలని డిమాండ్లు వస్తున్నాయి.

#### అందుబాటులోకొస్తే సకల సదుపాయాలు..

ఆయా గురుకులాల నిర్మాణ పనులకు శుక్రవారం ప్రజాప్రతినిధులు శంకుస్థాపన చేయనున్నారు. ఒక్కో గురుకులానికి రూ.200 కోట్ల వరకు కేటాయించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకుల సొసైటీలకు చెందిన నాలుగు పాఠశాలలు ఈ భవనంలో ఉంటాయి. ఆయా పాఠశాలలను సకల సదుపాయాలతో నిర్మించనున్నారు. ప్రాంగణంలో టీచింగ్, నాన్‌టీచింగ్ స్టాఫ్ క్వార్టర్ల నిర్మాణం, గ్రీన్ క్యాంపస్, సోలార్ విండ్ ఎనర్జీ సదుపాయాలు, ల్యాబ్‌లు, కంప్యూటర్ సెంటర్, లైబ్రరీ, ఆడిటోరియం, ఇండోర్ స్పోర్ట్స్, జిమ్, ల్యాండ్ స్కేప్ కోర్టులు తదితర సదుపాయాలు ఉండనున్నాయి. ఒక్కో గురుకులంలో 2,560 మంది విద్యార్థులకు ప్రవేశం కల్పించనున్నారు. 120 మంది టీచర్లు పనిచేయనున్నారు.

#### యాదాద్రిపై ఎందుకీ వివక్ష..?



ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మంత్రులు ఉన్న చోటనే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాలలు మంజూరు చేశారు. మరి యాదాద్రి భువనగిరి జిల్లా ఏం పాపం చేసింది. సూర్యాపేటకు రెండు ఇచ్చినప్పుడు.. మా జిల్లాకు ఒక్కటైనా ఇవ్వాలి కదా..? గురుకులాలు అందుబాటులోకి వస్తే ఎన్నో సదుపాయాలు కలుగుతాయి. సర్కారు ఫలాలు మా జిల్లా ప్రజలకు ప్రభుత్వం ఇవ్వదల్చుకోలేదా..? దీనిపై ప్రభుత్వం నిర్ణయం సబబుగా లేదు. అన్ని నియోజకవర్గాలకు డిమాండ్ వస్తున్న నేపథ్యంలో అన్నింటికీ ఒకేసారి మంజూరు చేయాలి.

**- జక్కిడి నగేశ్, బీఆర్‌ఎస్వీ జిల్లా ప్రధాన కార్యదర్శి**

## మీ దేవుడు ఎక్కడికీ పోడు.. నేను ముందుండి కొట్లాడుతా

- సర్వేలు ఏమీ చేయలేవు.. నిర్భయంగా ఉండండి
- ఎఫ్‌టీఎల్ పరిధిలో ప్రజలకు ధైర్యం చెప్పిన మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి



సూర్యాపేటలో కాలనీ వాసులకు ధైర్యం చెప్తున్న మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట టౌన్, అక్టోబర్ 10 : 'వందల ఏండ్ల నుంచి దేవుడికి మీరు చేస్తున్న పూజలు మీకు మంచే చేస్తాయి.. మీ దేవుడు ఎక్కడికీ పోడు.. మీ ఇండ్లు ఎవరూ కూల్చలేరు.. నేను మీ వెంట ఉండి కొట్లాడుతా' అని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ఎఫ్‌టీఎల్ పరిధిలో ప్రజలకు ధైర్యం చెప్పారు. ప్రభుత్వం తీసుకొచ్చిన హైడ్రాతో గత కొద్ది రోజులుగా సూర్యాపేట జిల్లా కేంద్రంలోని 30, 43వ వార్డుల పరిధిలో అధికారులు సర్వే చేస్తుండగా ప్రజలు భయాందోళన చెందుతున్న విషయం తెలిసిందే. గురువారం సద్దుల బతుకమ్మ వేడుకల్లో పాల్గొనేందుకు వెళ్లిన మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డికి జనం తమ గోడు వెళ్లబోసుకోగా ఆయన పైవిధంగా స్పందించారు.

# పుడమి తల్లికి పూల శోభ

## ఊరూరా సద్దుల బతుకమ్మ సంబురం

### ఆడిపాడిన ఆడబిడ్డలు

### సూర్యాపేటలో బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి



సూర్యాపేట సద్దుల చెరువులో బతుకమ్మ నిమజ్జనం చేస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు

రామగిరి/సూర్యాపేట టౌన్, అక్టోబర్ 10 : పుడమి తల్లి పూల శోభతో పులకరించింది. తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మలను ఒక చోట చేర్చి ఆడి పాడగా పల్లె, పట్నం హరివిల్లులా మారింది. సద్దుల బతుకమ్మ సంబరాలు గురువారం రాత్రి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సంబురంగా జరిగాయి. మహిళలు, యువతులు పెద్దఎత్తున పాల్గొని ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. అనంతరం వాయినాలు ఇచ్చి పుచ్చుకుని 'పోయిరా గౌరమ్మ.. పోయిరావమ్మా.. అందరినీ చల్లంగా చూడు.. వచ్చే ఏడాది మళ్లీ రావమ్మ' అంటూ మహిళలు బతుకమ్మకు వీడ్కోలు పలికారు. ఆ తర్వాత బతుకమ్మలను చెరువులు, కుంటలు, కాల్వల్లో నిమజ్జనం చేశారు. పలు చోట్ల ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు వేడుకల్లో పాల్గొన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి బతుకమ్మ సంబురాల్లో పాల్గొన్నారు.



హాలియాలో బతుకమ్మ పేర్చుతున్న మాజీ ఎమ్మెల్యే నోముల భగత్, ఆయన కుటుంబసభ్యులు



మోతె మండల కేంద్రంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



నల్లగొండలోని శ్రీనగర్ కాలనీలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు





సూర్యాపేట సద్దుల చెరువు వద్ద బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న మహిళలు



నల్లగొండ రాక్‌హిల్స్ కాలనీలో..



మిర్యాలగూడ చైతన్య నగర్‌లో



నల్లగొండ వల్లభరావు చెరువులో బతుకమ్మల నిమజ్జనం

## పండుగకు పల్లె బాట



చౌటుప్పల్, అక్టోబర్ 10 : బతుకమ్మ వేడుకలు, దసరా పండుగ సందర్భంగా హైదరాబాద్‌లో ఉంటున్న జనం పల్లెబాట పట్టారు. దాంతో విజయవాడ హైవేపై వాహనాల రద్దీ కొనసాగింది. చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో గురువారం వాహనాలు బారులుదీరి వెళ్లాయి. ఈ సందర్భంగా ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు.

## డీఎస్సీ అభ్యర్థుల రిపోర్టు

రామగిరి, అక్టోబర్ 10 : డీఎస్సీ – 2024లో టీచర్ పోస్టులకు ఎంపికైన జిల్లాలోని 535 మంది అభ్యర్థులు గురువారం నల్లగొండలోని డీఈఓ కార్యాలయంలో రిపోర్టు చేశారు. ఎల్‌బీ స్టేడియంలో బుధవారం అందజేసిన ఉత్తర్వులతోపాటు సంబంధిత పత్రాలను ప్రత్యేక అప్లికేషన్‌ను పూర్తి చేసి అందజేశారు. శుక్రవారం కూడా ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రిపోర్టు చేయడానికి అవకాశం ఉందని డీఈఓ భిక్షపతి తెలిపారు.

## పిడుగు పాటుకు మహిళ మృతి

అడవిదేవులపల్లి, అక్టోబర్ 10 : పిడుగు పాటుతో మహిళ మృతి చెందిన ఘటన నల్లగొండ జిల్లా అడవిదేవులపల్లి గ్రామ శివారులో గురువారం చోటు చేసుకుంది. ఎస్ఐ శేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. అడవిదేవులపల్లి శివారులో మిరపతోటలో కలుపు తీసేందుకు దామరచర్ల మండలం వీర్లపాలెం గ్రామానికి చెందిన ఏడుగురు కూలీలు వచ్చారు. మధ్యాహ్న సమయంలో ఒక్కసారిగా భారీ వర్షం రావడంతో కూలీలందరూ సమీపంలోని వేప చెట్టు కిందికి వెళ్లి నిల్చున్నారు. అంతలోనే ఒక్కసారిగా చెట్టుపై పిడుగు పడడంతో పాతులోతు హనిమి(45) అక్కడికక్కడే మృతి చెందింది. మరో ముగ్గురు కూలీలు స్పృహ తప్పి పడిపోయారు. మిగతావారు కేకలు వేయడంతో సమీపంలోని పొలాల వారు వెంటనే అక్కడికి చేరుకొని స్పృహ కోల్పోయిన వారిని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతురాలి పెద్ద కుమారుడు కృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


నమస్తే తెలంగాణ
మనపత్రిక మన ఆత్మగౌరవం
సబ్ ఎడిటర్లు కావలెను
ప్రముఖ దినపత్రిక నమస్తే తెలంగాణ నల్లగొండ యూనిట్ కార్యాలయంలో పని చేయడానికి
సీనియర్ సబ్ ఎడిటర్లు/సబ్ ఎడిటర్లు కావలెను.
తెలుగు భాష, క్వార్క్ ఎక్స్‌ప్రెస్ మీద పట్టు, ప్రధాన పత్రికల్లో సబ్ ఎడిటర్‌గా పని చేసిన అనుభవం ఉండాలి.
ఆసక్తి గల అభ్యర్థులు పూర్తి వివరాలతో కూడిన బయోడేటాను hr@tppl.news మెయిల్ ఐడీకి ఈ నెల 20 లోగా పంపగలరు.
వివరాలకు 040-23291159